ఆహ్లాదం ఆవిరి!

- అన్ని హంగులతో బృందావనం గార్డెన్ నిర్మాణం
- కొన్ని రోజులకే మూతపడిన వైనం
- పట్టణ ప్రజలకు కరవైన వినోదం
- అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్న ప్రజలు



పార్కులో ఆకట్టుకుంటున్న శ్రీకృష్ణుడు కూర్చున్న రథాన్ని లాగుతున్న గుర్రాలు (ఫైల్)

నూజివీడు: పట్టణ పరిధిలో అన్ని హంగులతో నిర్మించిన బృందావన గార్డెన్ పార్కు రెండేళ్ల కిందటే మూతపడింది. కొన్ని రోజులు మాత్రమే పనిచేసిన ఈ పార్కు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచింది. డెబ్బై వేల మంది జనాభా ఉన్న పట్టణంలో నిరంతరం రోజువారీ కార్యకలాపాలతో తీరిక లేకుండా గడుపుతున్న ప్రజలకు సెలవు రోజున ఆహ్లాదంగా గడిపేందుకు ఒక్కటంటే ఒక్క పార్కు కూడా లేదు. ఇప్పుడిప్పుడే పట్టణంలో అపార్ట్‌మెంట్ల సంస్కృతి పెరుగుతుండటంతో పాటు ప్రజలు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపేందుకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. ట్యాక్సుల రూపేణా కోట్లాది రూపాయలు చెల్లిస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు అభివృద్ధి చేసిన పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ఆసక్తిని చూపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో చేసేదేమీ లేక వినోదం కోసం సినిమా థియేటర్లపైనే ప్రజలు ఆధారపడుతున్నారు.

విద్యుత్ బిల్లుల భారంతో..

పట్టణ పరిధిలోని ఆటోనగర్ సమీపంలో 15 ఏళ్ల కిందట ప్రైవేట్ సంస్థ వెంచర్ వేసి అందులో బృందావనం గార్డెన్ పేరుతో పార్కును అభివృద్ధి చేసింది. ఆ తరువాత వెంచర్‌లో ప్లాట్లు అన్నీ విక్రయించే శాక పార్కును మున్సిపాలిటీకి అప్పగించింది. 2018కి ముందు అప్పట్లో ఉన్న సబ్ కలెక్టర్ సహకారంతో పార్కుకు రూ.15 లక్షల మున్సిపల్ నిధులను వ్యయం చేసి విద్యుత్ సదుపాయాన్ని కల్పించారు. అనంతరం కొన్ని రోజులు పార్కు పని చేసింది. ఆ తరువాత విద్యుత్ బిల్లులు భారమై పోతుండటంతో పార్కు మూతపడింది.

అందుబాటులోకి వస్తే ఆదాయం

బృందావనం గార్డెన్స్‌లో ఉన్న పార్కు ప్రజలకు అందుబాటులోకి వస్తే ప్రజలకు ఆహ్లాదం, ఆనందం లభిస్తాయి. దీని ద్వారా పురపాలక సంఘం ఆదాయాన్ని కూడా రాబట్టుకునే అవకాశం ఉంది. పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో చుట్టూ తోటల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న ఈ పార్కును ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రజలు సందర్శించేలా ఏర్పాట్లు చేస్తే పట్టణ ప్రజలకు కరవైన ఆహ్లాదం, వినోదం లభిస్తాయి. పచ్చని గడ్డి పరిచిన పార్కు ఆవరణ, వాటర్ ఫౌంటేన్లు, అందమైన సిమెంట్ విగ్రహాలు తదితర వాటితో చూడముచ్చటగా పార్కు ఉంది. మున్సిపాలిటీ ఎవరికైనా కాంట్రాక్టుకు ఇస్తే వారు ఎంతో కొంత టిక్కెట్ పెట్టుకుని పలు సౌకర్యాలు ఏర్పాటు చేసి పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని, వినోదాన్ని అందించేలా చేయవచ్చు. దీనివల్ల పట్టణ ప్రజలకు వినోదం, పురపాలక సంఘానికి ఆదాయం సమకూరుతుంది. పట్టణ ప్రజలతో పాటు పట్టణానికి దగ్గరగా ఉన్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా సెలవు రోజులలో వచ్చే వీలుంటుంది.



పార్కులో ఉన్న వాటర్ ఫౌంటేన్లు (ఫైల్)



పచ్చదనం నిండిన పార్కు (ఫైల్)

క్లుప్తంగా

నాన్‌స్టాప్ సర్వీసులుగా పల్లె వెలుగు బస్సులు

ప్రయాణికుల ఆగ్రహం



నూజివీడు: నూజివీడు ఆర్టీసీ డిపో అధికారుల తీరుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నూజివీడు నుంచి విజయవాడకు నడుపుతున్న నాన్‌స్టాప్ సర్వీసుల్లో కొన్నింటికి పల్లె వెలుగు బస్సులు నడుపుతుండటంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నాన్‌స్టాప్ సర్వీసులకు రూ.65 వసూలు చేస్తూ పల్లె వెలుగు బస్సులను ఏర్పాటు చేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. అది కూడా కాలం చెల్లిన బస్సులను నడుపుతుండటం గమనార్హం. వేగంగా వెళ్లడం అటుంచితే కూర్చునే సీట్లు కూడా సరిగా ఉండటం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా నాన్‌స్టాప్ సర్వీసులకు ఎక్స్‌ప్రెస్ బస్సులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

క్షీర బంధు చెక్కు అందజేత



రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండలంలోని శ్రీరామపురం సంఘం అధ్యక్షుడు నాదెళ్ల భాస్కరరావు ఇటీవల మృతిచెందారు. క్షీరబంధు పథకం ద్వారా మంజూరైన రూ. 50 వేల చెక్కును మృతుడి భార్య నాదెళ్ల లక్ష్మీ నరసమ్మకు కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యుడు బొట్టు రామచంద్రరావు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో తిరువూరు పాల శీతల కేంద్రం మేనేజర్ టి. సాంబమూర్తి, సంఘం అధ్యక్షుడు నాదెళ్ల చెన్నకేశవరావు, నెక్కలపు వాణీశ్రీ, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత



నూజివీడు: మండలంలోని లీలానగర్ అడ్డ రోడ్డు వద్ద దిగవల్లి వెళ్లే మార్గంలో వరద నీటికి రోడ్డు అంచు కోతకు గురై భారీ గుంత ఏర్పడింది. ఈ గుంత ఏర్పడి నెలలు గడుస్తున్నా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఏదైనా ప్రమాదం సంభవించే వరకు అధికారులు స్పందించరా అని స్థానికులు, వాహన చోదకులు ప్రశ్నిస్తున్నారు. రాత్రి వేళల్లో ఎదురుగా వాహనాలు వస్తే ఈ గుంత కనిపించదని, ఖచ్చితంగా అందులో పడి ప్రాణాలు కోల్పోవడం ఖాయమని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గుంతను పూడ్చించాలని కోరుతున్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు



ఇబ్రహీంపట్నం(మైలవరం): విద్యతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ పాస్టర్ మోగులూరి ఎలీషా అన్నారు. కేతనకొండ గ్రామంలోని గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని చెప్పారు. ఒక లక్ష్యం నిర్దేశించుకుని దాని సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. భవిష్యత్‌లో గ్రేస్ మినిస్ట్రీస్ ద్వారా ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సెక్రటరీ సుమలత, పెద్దలు అబ్రహాం, యోబు, హరీష్, నాగరాజు, ప్రభుదాస్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



విజయవాడకల్చరల్: మురళీమోహన్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముద్రా నృత్య కళాకేంద్రం బాలికలు కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించారు. శంభో శివశంభో, అదివో అల్లదివో తదితర కీర్తనలకు నృత్యాలను అభినయించారు. అలాగే చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ వస్త్ర ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. మురళీమోహన్ కల్చరల్ ఆర్ట్స్ నిర్వాహకులు శేఖర్, మురళీమోహన్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కాజ్‌వేకి మోక్షం కలిగేనా?

- వరదల సమయంలో కొట్టుకుపోతున్న కాజ్‌వే
- చిన్నంపేట–శివాపురం మధ్య నిలిచిపోతున్న రాకపోకలు
- గ్రామస్తుల ఇబ్బందులు



చిన్నంపేట తమ్మిలేరు వాగు వద్ద కొట్టుకుపోయిన కాజ్‌వే (ఫైల్)

చాట్రాయి: తరుచూ కొట్టుకుపోతున్న కాజ్‌వేతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని చిన్నంపేట చింతలపూడి మండలం శివాపురం గ్రామాల మధ్య తమ్మిలేరు వాగుపై కాజ్‌వే వరదలు వచ్చినపుడల్లా కొట్టుకుపోతుంది. దీంతో ఇరు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఇరు గ్రామాల మధ్య వ్యవసాయ భూములు ఉండటంతో రైతులు ఇబ్బందులు పడేవారు. శివాపురం నుంచి చిన్నంపేటకు చదువుల నిమిత్తం వెళ్లే విద్యార్థుల బాధలు వర్ణనాతీతం. కాజ్‌వే కొట్టుకుపోయినప్పుడల్లా తాత్కాలికంగా గ్రావెల్ ఏర్పాటు చేసి రాకపోకలను పునరుద్ధరించేవారు. గత ప్రభుత్వంలో ఎన్నికల నోటిఫికేషన్ ముందు కాజ్‌వే పనుల నిమిత్తం రూ. 40 లక్షలు, రూ.20 లక్షలతో వాగు నుంచి చిన్నంపేట మెయిన్ రోడ్డు వరకు బీటీ రోడ్డుకి టెండర్లు పిలిచారు. ఎన్నికల నిబంధనలతో పనులు ప్రారంభించలేదు. కొత్త ప్రభుత్వంలో కాజ్‌వే పనులు ప్రారంభించాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం

చిన్నంపేట తమ్మిలేరు కాజ్‌వే నిర్మాణ పనుల నిమిత్తం టెండర్లు పిలిచాం. ఎన్నికల నిబంధనలు అమలులో ఉండడం వలన పనులు చేపట్టలేదు. ప్రభుత్వం అనుమతులు ఇవ్వగానే పనులు ప్రారంభిస్తాం.

– జీ కృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి



నూజివీడులో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



గంపలగూడెంలో నివాళులర్పిస్తున్న నాయకులు

నూజివీడు: మండలంలోని పలు గ్రామాల్లో, పట్టణంలో జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ నూజివీడు మండల అధ్యక్షుడు గోగినేని శ్రీనివాస కుమార అప్పారావు మాట్లాడుతూ నెహ్రూ సోషలిజానికి భిన్నంగా స్వేచ్ఛా మార్కెట్ విధానానికి మద్దతు పలికిన గొప్ప నాయకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ అని అన్నారు. దేశంలోని హిందువులు, ముస్లింలందరికీ ఒకే విధమైన పౌరస్మృతి ఉండాలని మొదటగా గళమెత్తిన నాయకుడని చెప్పారు. ఆయన సిద్ధాంతాల ఆచరణకు ప్రతి బీజేపీ కార్యకర్త ముందుకు సాగాలన్నారు. బీజేపీ నాయకులు వైఎస్ దొరై, శివరాజు వసుంధర, చెరుకుమళ్ల సాగర్‌శర్మ, దోసపాటి జనార్ధనరావు, నెక్కలపు కృష్ణారావు, కన్నెగంటి సాంబశివరావు, బడుగు శ్రీకాంత్, బొబ్బిలి కనక మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గంపలగూడెం: జనసంఘ్ నేత శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం గంపలగూడెంలో నిర్వహించారు. స్థానిక బస్టాఫ్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడారు. నాయకులు ఎ. క్రాంతికుమార్, వనమా సుజాత, కె. నాగగోపాలకృష్ణ, కొదుమూరి సూర్యప్రకాష్, డీవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ధీర వనిత నిర్మల రాధక్క



నిర్మల రాధక్కకు నివాళులర్పిస్తున్న గ్రామస్తులు, సీపీఐ నాయకులు

నూజివీడు: సాయుధ పోరాటంలో వెన్ను చూపని ధీర వనిత కామ్రేడ్ అక్కినేని నిర్మల రాధక్క అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు అన్నారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలు, సీపీఐ ఎంఎల్ నాయకురాలు, నక్సల్‌బరి ఉద్యమ సాయుధ పోరాట నాయకురాలు కామ్రేడ్ నిర్మల రాధక్క సంతాప సభ ఆదివారం ఆమె స్వగ్రామమైన పోతురెడ్డిపల్లిలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ 1967 నుంచి నిర్మల రాధక్క నక్సల్‌బరి సాయుధ పోరాటంలో పాల్గొన్నారని చెప్పారు. పుల్లారెడ్డి మరణానంతరం కూడా పలు ఉద్యమాల్లో పాల్గొన్న ఆమె వయస్సు రీత్యా గత కొంతకాలంగా హైదరాబాద్‌లోని కుమార్తె వద్ద ఉంటూ విశ్రాంత జీవితం గడుపుతూ అనారోగ్యంతో మృతిచెందారని చెప్పారు. శ్రమజీవులు, గిరిజనుల హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేసిన కామ్రేడ్ నిర్మల రాధక్క జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, గ్రామ ప్రముఖులు అక్కినేని ధనకోటేశ్వరరావు, అక్కినేని రంగారావు, మాజీ సర్పంచి అక్కినేని చందు, పీఏసీఎస్ మాజీ సర్పంచి అక్కినేని బెనర్జీ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, మడుపల్లి నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వీఎంసీ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు-పరిష్కారం

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, ఇకపై ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం జరుగుతుందని, నగరపాలక సంస్థ ప్రధాన, జోనల్ కార్యాలయాల్లో కూడా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఉత్సాహంగా ప్రపంచ ఒలింపిక్ దినోత్సవం

క్రీడాకారులకు సత్కారం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రపంచ ఒలింపిక్ దినోత్సవం పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం విజయవాడలోని దుర్గాఘాట్‌లో అమరావతి బోటింగ్ క్లబ్ క్రూయిజ్‌లో నిర్వహించిన వేడుకలు ఉత్సాహభరితంగా జరిగాయి. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని అధ్యక్షత వహించి మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ, ఆసియా క్రీడలకు రోయింగ్ క్రీడాకారులను పంపామని తెలిపారు. ఔత్సాహిక క్రీడాకారులైన విద్యార్థులకు వారి అభిరుచి మేరకు ఆటల్లో శిక్షణ ఇచ్చి ప్రోత్సహించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు పంపుతున్నామని చెప్పారు. క్రీడాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమన్నారు. ముఖ్యఅతిథి ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్‌తో కలిసి జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు బి. నీహారిక (జాతీయ స్థాయి రెజ్లింగ్), వి.గీత (రాష్ట్ర స్థాయి రగ్బీ, రెజ్లింగ్), జాహ్నవి (స్టేట్ మీట్‌లో బాక్సింగ్, నేషనల్స్‌లో సైక్లింగ్), మోహన్ వంశీ (స్టేట్ మీట్‌లో బాక్సింగ్ ప్లేయర్), రోహిత్ కుమార్ (జాతీయ కుస్తీ)లను సత్కరించారు. అనంతరం ఒలింపిక్ బెలూన్లను ఎగురవేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ అసోసియేషన్ తరఫున డాక్టర్ తరుణ్ కాకాని క్రీడాకారులకు అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని కొనియాడారు. చదువుకుంటూనే క్రీడల్లో రాణించి దేశ కీర్తి ప్రతిష్టలను పెంపొందించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోలపల్లి గణేష్, శ్రీధర్, సంఘం నుంచి పవన్, బోస్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పొగచూరుతున్న బతుకులు

- డంపింగ్ యార్డులో వ్యర్థాల దహనం
- కమ్ముకుంటున్న పొగతో ఊపిరి ఆడక ఇబ్బందులు
- శ్వాసకోశ వ్యాధులు, శరీరంపై దద్దుర్లు
- యార్డును తరలించాలని స్థానికుల డిమాండ్



డంపింగ్ యార్డ్‌లో వ్యర్థాలను కాలుస్తుండటంతో కమ్ముకున్న పొగ

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని గంగానమ్మ గుంట వద్ద ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌తో స్థానిక గన్నవరం రోడ్డులోని జూనియర్ కళాశాల వద్ద నివాసం ఉంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడ డంపింగ్ యార్డ్‌లోని వ్యర్థాలను సిబ్బంది తగులబెడుతున్నారు. ఈ సమయంలో పొగ విస్తరించడంతో స్థానికులకు ఊపిరి అందక విలవిలలాడుతున్నారు. వ్యర్థాల నుంచి వస్తున్న పొగను పీల్చడం వల్ల చిన్న పిల్లలు కళ్లు తిరిగి పడిపోతున్నారు. శ్వాసకోశ, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు, దురద, శరీరంపై దద్దుర్లు వంటి సమస్యలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్ యార్డు సమస్యలను పరిష్కరించాలని స్థానికులు అధికారులను పలుసార్లు కోరినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి డంపింగ్‌యార్డును వేరే ప్రాంతానికి తరలించాలని, పొగ బయటికి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



వేరే ప్రాంతానికి తరలించాలి

డంపింగ్ యార్డులోని వ్యర్థాలను కాల్చడంతో దాని నుంచి వచ్చే పొగ మా ప్రాంతాన్ని పూర్తిగా కమ్మేస్తోంది. దీనివలన ఊపిరి కూడా ఆడటం లేదు. కొన్నిసార్లు చిన్నపిల్లలు అస్వస్థతతకు గురవుతున్నారు. డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలించాలి.

– మానుకొండ శ్రీనివాసరెడ్డి, ఆగిరిపల్లి



విష వాయువులతో వ్యాధులు

డంపింగ్ యార్డులోని వ్యర్థాల నుంచి వెలువడే విష వాయువుల వల్ల నాకు శరీరం మీద దద్దుర్లు వచ్చాయి. ఆ పొగను పీల్చడం వల్ల ఊపిరితిత్తులకు ఇన్ఫెక్షన్ వచ్చిందని డాక్టర్లు తెలిపారు. ఇప్పటివరకు వైద్యానికి రూ.6 లక్షల వరకు ఖర్చు చేయాల్సి వచ్చింది. డంపింగ్ యార్డును ఇక్కడి నుంచి తరలించాలి.

– మాదల సతీష్, ఆగిరిపల్లి

చీఫ్ ఇంజినీర్ జవహర్‌కు సన్మానం



నూతన చీఫ్ ఇంజినీర్ జవహర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం(మైలవరం): జవహర్ నేతృత్వంలోని సీలేరు కాంప్లెక్స్ అత్యధిక విద్యుత్ ఉత్పాదన చేసే సంస్థ అని, ఈ సంస్థ పేరు ప్రఖ్యాతలు మరింత ఉన్నత స్థానాలకు తీసుకువెళ్లాలని డాక్టర్ ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ (ఏఅండ్‌ఎం) టి. నాగరాజు అన్నారు. జవహర్ ఇటీవలి వరకు డాక్టర్ ఎన్టీటీపీఎస్ తృతీయ దశ సూపరింటెండింగ్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తించి పదోన్నతిపై చీఫ్ ఇంజినీర్‌గా సీలేరు కాంప్లెక్స్‌కు బదిలీపై వెళ్లారు. సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజినీర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారి డాక్టర్ ఎన్టీటీపీఎస్‌కు విచ్చేసిన సందర్భంగా ఆయనను సిబ్బంది ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్రాంచ్ ప్రెసిడెంట్ ఎం. ఉమా విజయ్‌చంద్, సీహెచ్‌వీఎస్ నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యప్రసాద్, డీఈలు ఈశ్వరయ్య, విజయ్‌కుమార్, బాలకృష్ణ, మహిళా ప్రతినిధి లత, కేఎస్‌వీ రవి కుమార్, గోసాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలాం స్ఫూర్తితో.. పేదలకు సేవ



విద్యార్థులకు సాయం అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అబ్దుల్ కలాం స్ఫూర్తితో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ అన్నారు. కేఎల్‌రావు పార్కులోని అబ్దుల్ కలాం వాకర్ అసోసియేషన్ 10వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆదివారం పలువురు పేద విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. అసోసియేషన్‌లో సభ్యులు సేకరించిన నిధుల నుంచి విద్యార్థికి రూ. 12 వేలు సాయం అందించగా, జగుపిల్ల శ్రీనివాసరావు ఏడాది చదువు కోసం అవసరమైన రూ. 20 వేలు, మరో విద్యార్థికి రూ. 5 వేల సాయాన్ని అందచేశారు. వాకర్స్ అసోసియేషన్‌ను అభినందించి, మరి కొంత మంది దాతలు ముందుకు వచ్చి ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు జి. విజయ్‌కుమార్, శివకుమార్ పట్నాయక్, పోతిన రమేష్, బీరం శ్రీనివాసరావు, జ్ఞానదేవ్, మహాదేవ్, రాంబాబు, అవ్వారు బుల్లాబ్బాయ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద చిన్నారులకు నిత్యావసరాల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): అనాథ, నిరుపేద చిన్నారులకు ఆదివారం హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు కోరంగి నాగమల్లీశ్వరి, షఫీ మాట్లాడుతూ తమ వంతు బాధ్యతగా నిరుపేద చిన్నారులకు దాతలు, ట్రస్ట్ సభ్యుల సహకారంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకుని చిన్నారులు జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు.

ట్రస్ట్ సభ్యుడు డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా నిరుపేద, అనాథ చిన్నారులకు ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ట్రస్ట్‌ను స్ఫూర్తిగా తీసుకుని తోటివారికి సాయం చేయడం అలవాటుగా చేసుకోవాలని సూచించారు.

750 మందికి ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సైరాభాను

లబ్బీపేట(విజయవాడతూర్పు): పాయకాపురం విశాలాంధ్రకాలనీలోని ఎస్‌జీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆదివారం జరిగిన వైద్య శిబిరంలో 750 మంది వైద్య పరీక్షలు చేశారు. సింగ్‌నగర్ ఫ్యామిలీ ఆస్పత్రి ఫిజీషియన్ డాక్టర్ సైరాభాను, వన్‌టౌన్‌లోని అయాన్ ఆస్పత్రి నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ బషీర్ అహ్మద్ మయూక్ వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సైరాభాను.. వైద్య బృందం సాధారణ వ్యాధులు, బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి వ్యాధులు ఉన్న వారికి 426 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. పలువురికి 25 రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేశారు. డాక్టర్ బషీర్ అహ్మద్ 320 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఐ డ్రాప్స్ ఉచితంగా అందజేశారు. డాక్టర్ సైరాభాను దోమకాటు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కలిగించారు. డాక్టర్ పవన్‌కుమార్, స్కూల్ ప్రిన్సిపాల్ ఉప్పరపల్లి లక్ష్మీ రాజ్యపూర్ణ, అయాన్ పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన పెరగాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలో ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని లయన్స్ క్లబ్ విజయవాడ ఈస్ట్ అధ్యక్షుడు, డాక్టర్ హనుమయ్య అన్నారు. శ్రీ సంభవనాథ్ రాజేంద్ర సూరిజైన్ శ్వేతాంబర్ ట్రస్ట్, శ్రీ సంభవనాథ్ జైన్ పరిషత్, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ సంయుక్త ఆధ్వర్యాన పాతబస్తీలోని ఆరాధన భవన్‌లో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హనుమయ్య మాట్లాడుతూ రక్తదానంపై సమాజంలో అనేక అపోహలు ఉన్నాయన్నారు. రక్తం సకాలంలో అందక లక్షలాది మంది మృత్యువాత పడుతున్నారన్నారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు. క్లబ్ ప్రముఖులు తేజ్‌రోజా సోలంకి మాట్లాడుతూ 18 నుంచి 60 సంవత్సరాలు వయస్సు కలిగి, 50 కిలోల కన్నా అధికంగా బరువు ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చన్నారు. యువత ప్రతి మూడు మాసాలకొకసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రముఖులు రాజేంద్రకుమార్ సోలంకి, సంపత్‌కుమార్, సుజిత్‌కుమార్ సోలంకి, డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.